సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



'సీతారామ' మట్టి మాయం!

ములకలపల్లి మండల పరిధిలోని సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

8లో



యంత్రాలను వినియోగించుకుంటే..

పంటల్లో వ్యర్థాల తొలగింపు, ఉత్పత్తులను ఆరబెట్టేందుకు యంత్రాలు ఉన్నా అవగాహన లేక రైతులు వినియోగించడం లేదు.

8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, అక్టోబర్ 7న నిర్వహించే శబరి యాత్రపై ఆలయ ఈఓ దామోదర్‌రావు ఆదివాసీ గిరిజన నాయకులతో సమావేశం నిర్వహించారు. శబరి యాత్రకు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడుకు చెందిన గారపాటి తులసమ్మ రూ.లక్ష, బొప్పాడి కాశీబాబు–శాంతారాణి దంపతులు రూ.50వేల చెక్కును ఆలయ అధికారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబసభ్యులు స్వామివారిని దర్శించుకోగా, అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. ఆలయ పీఆర్వో రామిరెడ్డి, వేదపండితులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో శనివారం రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. పూజలో పాల్గొనేవారు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు నందీశ్వరుడికి అభిషేకం

పెద్దమ్మగుడి సముదాయంలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీ నందీశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

నేడు జాబ్ మేళా

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 200 ఖాళీల (ప్రొడక్షన్ ట్రైనీ) భర్తీకి కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే బీఎస్సీ చదువుకునేందుకు ఆసక్తి గలవారికి ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీ వారు ఆర్థిక సాయం, వసతి సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

'ఎర్త్ సైన్సెస్'లో స్పాట్ అడ్మిషన్లకు 14 మంది

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బీఎస్సీ జియాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు 14 మంది విద్యార్థులు హాజరయ్యారని ఓఎస్డీ జగన్‌మోహన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 20 వరకు అవకాశం కల్పించేందుకు యూనివర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకుంటున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ పేరుతో కలల ప్రపంచం!

రెక్కలు విప్పుతున్న 'రియల్టీ' రాబందులు

- గతంలో జిల్లా కేంద్రం ఏర్పాటప్పుడూ ఇదే పరిస్థితి
- 'కలెక్టరేట్ వెంచర్' బాధితులకు నేటికీ దక్కని న్యాయం
- తాజాగా కార్పొరేషన్ పేరిట వెలుస్తున్న అనధికారిక వెంచర్లు
- రియల్ ఎస్టేట్ మోసాలపై స్పందించని రెవెన్యూ, బల్దియా





సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో రియల్ ఎస్టేట్ రంగంలో మోసాలకు పాల్పడేవారు మళ్లీ రెక్కలు విప్పుతున్నారు. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ సామాన్యుల కష్టార్జితాన్ని కొల్లగొట్టేందుకు సిద్ధమవుతున్నారు. వీరి ఆగడాలకు ఆరంభంలోనే అడ్డుకట్ట వేయకుంటే జిల్లా ఆవిర్భావం సమయంలో జరిగిన మోసాలే పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా సమీకృత కార్యాలయం ఎదురుగా 2017లో వెంచర్‌లో స్థలాలు కొనుగోలు చేసిన పలువురికి ఇప్పటికీ న్యాయం జరగలేదు. తమకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపించాలని, తమలా మరొకరకు మోసపోకుండా చూడాలని గత నాలుగైదేళ్లుగా కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో బాధితులు పలుమారు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు.

ఎనిమిదేళ్లుగా తేలని పంచాయితీ..

అనధికారిక వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నించగా ఇవి తమ ప్లాట్లని, తాము ఫలానా వ్యక్తుల నుంచి కొనుగోలు చేశామని వేరే వ్యక్తులు రంగంలోకి దిగారు. ఈ విషయమై పాల్వంచ పోలీస్‌స్టేషన్, ఎస్పీ ఆఫీస్, కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో బాధితులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎనిమిదేళ్లుగా ఎటూ తేలడం లేదు. స్థానిక దాదాలు రంగంలోకి దిగినా గొడవలు, రక్తపాతాలు మినహా ఒరిగిందేమీ లేదు. అనధికారిక వెంచర్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భారీ కమీషన్లు తీసుకుని అమాయకులకు ప్లాట్లు అంటగట్టిన బ్రోకర్లు తమను మోసం చేశారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.

నిస్తేజంగా కార్పొరేషన్..

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను ఏకం చేస్తూ కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటైంది. ఈ మేరకు కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు జీఓ వచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు పాల్వంచ మొదలు సుజాతనగర్ వరకు ఎక్కడిక్కడ వెంచర్లు వెలుస్తూనే ఉన్నాయి. వీటికి చట్టబద్ధత ఉందా లేదా అనే అంశాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. కార్పొరేషన్ పేరుతో కలల ప్రపంచం చూపిస్తూ అనధికారిక వెంచర్లు పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నా బల్దియా నుంచి కనీస అప్రమత్తత కనిపించడం లేదు.

ఎకరంలో 29 ప్లాట్లు..

జిల్లా ఏర్పాటు తర్వాత ప్రస్తుత పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో సర్వే నంబర్ 416/1/2/1లో (ఐడీఓసీ ఎదురుగా) ఉన్న ఎకరం స్థలంలో 2017లో అనధికారిక వెంచర్ వేశారు. సాధారణంగా ఎకరం స్థలంలో 30, 20 అడుగులతో రోడ్లు, పదిశాతం కమ్యూనిటీ స్థలాన్ని మినహాయిస్తే 200 గజాల చొప్పున 12 నుంచి 14 ప్లాట్లు చేయొచ్చు. కానీ ఈ వెంచర్‌లో ఏకంగా 29 మందికి 200 గజాల ప్లాట్లు ఉన్నాయంటూ రిజిస్ట్రేషన్ చేయించారు. త్వరలో నిర్మించే కలెక్టరేట్ ఎదురుగా ప్లాట్లు కారు చౌకగా వస్తున్నాయని, ఆలస్యం చేస్తే మళ్లీ అవకాశం రాదని ఆరు నెలల్లోనే ప్లాట్లు అమ్మేశారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో ఎక్కువ మంది కూలీలు, టైలర్లు, చిన్న చిన్న కిరాణా కొట్ల నిర్వాహకులే ఉన్నారు. వీరిలోనూ మహిళలే అధికంగా ఉన్నారు.

పైసాపైసా కూడబెట్టి కొన్నాం



మాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భర్త కూలీ పని, నేను టైలరింగ్ చేస్తూ పైసాపైసా కూడబెట్టాం. ఇద్దరు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2017లో కలెక్టరేట్ ఎదురుగా వెలిసిన వెంచర్‌లో 200 గజాల ప్లాట్ కొనుగోలు చేశాం. ప్లాట్ అమ్మిపెట్టిన బ్రోకర్, వెంచర్ వేసిన యజమాని చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఇప్పటికీ మాకు ప్లాటు దక్కలేదు. అడిగితే మహిళ అని కూడా చూడకుండా కొడుతున్నారు.

– రమాదేవి, కొత్తగూడెం

రెక్కలు ముక్కలు చేసుకుని



నా భర్త దుబాయ్‌లో ఉంటాడు. అక్కడ రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని, కడుపు మాడ్చుకుని కూడబెట్టిన డబ్బుతో 2017లో కలెక్టరేట్ ఎదురుగా వేసిన వెంచర్‌లో రెండు ప్లాట్లు కొనుగోలు చేశా. ఇప్పటికీ ఆ ప్లాట్లు మాకు అప్పగించలేదు. ఈ విషయమై కుటుంబంలో కలతలు వచ్చాయి. దయచేసి ఇప్పటికైనా అనధికారిక వెంచర్ల విషయంలో సర్వే జరిపి మాకు న్యాయం చేయాలి. మరొకరు నష్టపోకుండా చూడాలి.

– అరుణ, భద్రాచలం

సింగరేణి విస్తరణకు సహకరించండి

ఎస్‌బీఐ చైర్మన్‌తో భేటీలో సీఎండీ బలరామ్



ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టితో సింగరేణి సీఎండీ బలరామ్

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి విశ్వవ్యాప్తంగా విస్తరించేలా దేశ, విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సంసిద్ధత తెలిపింది. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ గురువారం ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ ఎండీ సత్యేంద్రకుమార్ సింగ్, సీజీఎం శైలేష్ ఉన్నితన్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. బొగ్గు ఉత్పత్తిలో అగ్రస్థానాన ఉన్న సింగరేణి త్వరలోనే దేశ, విదేశాల్లో కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించనుందని తెలిపారు. ఇప్పటికే కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ లభించిందని చెప్పారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ దేశంలోనూ పెద్ద ఎత్తున కీలక ఖనిజాల ఉత్పత్తికి సిద్ధమవుతున్నామని, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, 5 వేల మెగావాట్ల సోలార్, థర్మల్ ప్లాంట్లు, గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సీఎండీ వివరించారు. సింగరేణి చేపట్టే భారీ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో ఆర్థిక సహకారం అందించాలని కోరగా ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే సింగరేణి ప్రధాన ఆర్థిక లావాదేవీల (లీడ్) బ్యాంకుగా సేవలదింస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా సత్తా చాటాలని ఆకాంక్షించారు.

జాతీయ వర్క్‌షాప్‌నకు కలెక్టర్ హాజరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): న్యూ ఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్, ప్రవాసీ భారతీయ కేంద్రం మాల్లో గురువారం జరిగిన ఆస్పిరేషనల్ డిస్ట్రిక్స్, భవిష్యదిశ వర్క్‌షాప్‌నకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరయ్యారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్లానింగ్ సెక్రటరీలు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత మండల ప్రోగ్రామ్‌లలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, ప్రాథమిక సదుపాయాలు వంటి రంగాల్లో సాధించిన పురోగతిని సమీక్షించారు. ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లను చర్చించి భవిష్యత్‌లో కీలకమైన అభివృద్ధి సూచికలను సంపూర్ణంగా సాధించడానికి అవసరమైన చర్యల గురించి చర్చించారు. రాష్ట్రాల ప్రాధాన్యతలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు విధానంలో ఎదురయ్యే అడ్డంకులు, కావాల్సిన నూతన విధానాలపై కూడా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత మండల ప్రోగ్రామ్‌లలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు.

22 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేయాలన్న అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈనెల 22 నుంచి 28 వరకు ఓపెన్ స్కూల్ థియరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పదో తరగతి పరీక్షలకు చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ అభ్యర్థులకు బాబుక్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతికి 320 మంది, ఇంటర్‌కు 300 మంది హాజరు కానున్నారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్ వెంట తెచ్చుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. వివరాలకు 89192 79238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ బి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం జీ(వి)తం !

- 104 సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాల్లేవ్..
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలు



బూర్గంపాడు: ఆరు నెలలుగా వేతనాలందక 104 సిబ్బంది అప్పుల్లో కూరుకుపోతున్నారు. విధి నిర్వహణకు రోజూ ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేందుకు రవాణా చార్జీలకు కూడా కటకటలాడుతున్నారు. జీతాలు చెల్లించాలని అటు అధికారులను, ఇటు ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం శూన్యం. చివరకు మంత్రులు, ఆరోగ్యశాఖ కమిషనర్‌ను కలిసినా వేతనాలు మాత్రం రావడం లేదు. కనీసం దసరా పండుగకైనా చెల్లించి తమను ఆదుకోవాలని జిల్లాలోని 104 ఉద్యోగులు కోరుతున్నారు.

వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు..

జిల్లాలో 59 మంది 104 సిబ్బంది వివిధ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు ఫార్మసిస్టులుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా, ల్యాబ్ టెక్నీషియన్లుగా, డ్రైవర్లుగా, సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నారు. వీరికి గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో క్రమం తప్పకుండా వేతనాలు అందిన దాఖలాలు లేవు. 2008లో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 104 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దీర్ఘకాల రోగులకు ప్రతీ నెల వైద్యారోగ్య శాఖ ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించే లక్ష్యంతో 104 వాహనాలను ప్రవేశపెట్టారు. ఔట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించగా 2022 వరకు ప్రజలకు వైద్య సేవలు అందించారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 104 వాహనాలను తొలగించి, ఆ సిబ్బందిని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో సర్దుబాటు చేసింది. ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు నెలకు రూ. 22,750, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు రూ.19,500, సెక్యూరిటీ గార్డులకు రూ.15,600 చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని సిబ్బంది కోరుతుండగా.. ఆ మాటేమో కానీ సక్రమంగా వేతనాలు కూడా రాక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా బడ్జెట్ విడుదల చేసి తమకు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విషయమై బూర్గంపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావును వివరణ కోరగా.. 104 సిబ్బందికి సంబంధించి ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వలేదని, రాగానే వేతనాలు చెల్లిస్తామని చెప్పారు.

చార్జీలకు కూడా ఇబ్బంది

ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఆస్పత్రుల రాకపోకలకు రవాణా చార్జీలకు కూడా డబ్బులుండడం లేదు. కుటుంబం గడవటం కష్టంగా మారింది. కనీసం దసరా పండుగకైనా వేతనాలు అందించి ఆదుకోవాలి.

– రవి, 104 వర్కర్స్ యూనియన్ నాయకుడు

పట్టించుకోవడం లేదు

రోజూ ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న మమ్మల్ని పాలకులు పట్టించుకోవడం లేదు. ఐదారు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి. పిల్లల చదువులకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలు అందించాలి.

– శ్రీనివాస్, 104 వర్కర్స్ యూనియన్ నాయకుడు

ఆదివాసీల అభివృద్ధికి కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్



దిసోం సంస్థ విద్యార్థులతో పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని పీఓ బి.రాహుల్ దిసోం సంస్థ బృందానికి తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలోని దిసోం సంస్థ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఐటీడీఏ అమలుచేస్తున్న వివిధ పథకాల పరిశీలన నిమిత్తం గురువారం వచ్చారు. ఈ సందర్భంగా పీఓ రాహుల్‌ను కలిసి వారు పరిశీలన చేసిన ప్రదేశాల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజన మహిళలకు సబ్బులు, మిల్లెట్ బిస్కెట్లు, నాప్కిన్ వంటి వస్తు తయారీ యూనిట్లను, న్యూట్రి బాస్కెట్, చిక్కి యూనిట్, దాల్ మిల్, బ్రిక్స్ తయారీ, న్యూట్రి డ్రైమిక్స్, ఇప్పపువ్వు లడ్డూ యూనిట్ల ద్వారా జీవనోపాధి కలిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించే వారికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం ఉద్దీపకం వర్క్‌బుక్స్‌తో పాటు కెరీర్ గైడెన్స్ ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజన సంస్కృతిని తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేశామని, వారి గోత్రాలు సేకరించి ఇలవేల్పుల గ్రంథాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. దిసోం సంస్థ వ్యవస్థాపకుడు బిరేన్ భాటు మాట్లాడుతూ.. తమ సంస్థ విద్యార్థులు 15 నెలల పాటు దేశ పర్యటన చేసి వివిధ ప్రాంతాల్లోని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో గిరిజ మావిలన్(కేరళ), మిజింగ్ నర్జరి(అసోం), మునిర్(మహారాష్ట్ర), సోడె శ్రీను, సోడే లెనిన్, రాజేంద్రప్రసాద్(ఏపీ) పాల్గొన్నారు.

బూడిద తరలింపుతో జీవనోపాధి కల్పించాలి


భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా విడుదలయ్యే బూడిదను తరలించే బాధ్యత నిరుద్యోగ గిరిజన యువతకు అప్పగించాలని, వారికి జీవనోపాధి కల్పించాలని రాహుల్ అన్నారు. తన చాంబర్‌లో గురువారం బీటీపీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీటీపీఎస్ కింద భూములు కోల్పోయిన దమ్మక్కపేట సొసైటీలో 31 మంది, సాంబాయిగూడెం సొసైటీలో 38 మంది, సీతారాంపురం సొసైటీలో 33 మంది, పోతిరెడ్డిపల్లిలో మూడు సొసైటీలు కలిపి 253 మంది గిరిజన యువకులు సొసైటీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారని, బీటీపీఎస్ బూడిద తరలించే బాధ్యత ఎక్కువ శాతం వీరికే అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, డీఈ మురళీకృష్ణ, ఎస్‌ఈ శ్రీనివాస్, శివచంద్ర తదితరులు పాల్గొన్నారు.

2,343 మెట్రిక్ టన్నుల యూరియా

నేడు మరో 3వేల మెట్రిక్ టన్నులు..

ఖమ్మంవ్యవసాయం: జిల్లాకు యూరియా సరఫరా కొనసాగుతుంది. చింతకాని మండలం పందిళ్లపల్లిలోని రేక్ పాయింట్‌కు గురువారం 2,343 మెట్రిక్ టన్నుల ఎన్‌ఎఫ్‌ఎల్ కంపెనీ యూరియా చేరింది. ఇందులో 1,073 మెట్రిక్ టన్నులు ఖమ్మం జిల్లాకు, 470 మెట్రిక్ టన్నులు భద్రాద్రి జిల్లాకు, 600 మెట్రిక్ టన్నులను మహబూబాబాద్ జిల్లాకు చేరవేశారు. మిగిలిన 200 మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్‌గా నిల్వ చేశారు. ఇక శుక్రవారం మరో 3వేల మెట్రిక్ టన్నుల క్రిబ్–కో యూరియా చేరనుండగా, మూడు జిల్లాలకు 1,500, 300, వేయి మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేస్తామని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇందులో మిగిలే 200 మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్‌గా గోదాంల్లో భద్రపరుస్తామని వెల్లడించారు.

పామాయిల్ ఫ్యాక్టరీలకు నేటి నుంచి సెలవులు



దమ్మపేట: అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలకు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గెలలు ఎక్కువగా వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి రైతులు యథావిధిగా గెలలు తీసుకురావచ్చని సూచించారు.

406.10 అడుగులకు చేరిన కిన్నెరసాని

పాల్వంచరూరల్ : ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరగగా గురువారం 406.10 అడుగులకు చేరింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1000 క్యూసెక్కుల వరద రావడంతో ఒక గేటు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.



కిన్నెరసాని నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

నిలకడగా గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం 38 అడుగుల వద్ద నిలకడగా ఉంది. గత వారం రోజులుగా నీటిమట్టం పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. బుధవారం రాత్రి వరకు 35.30 అడుగులుగా ఉన్న ప్రవాహం.. గురువారం ఉదయం నుంచి పెరుగుతూ రాత్రికి 38 అడుగులకు చేరింది. ఆ తర్వాత నిలకడగా ఉందని, భక్తులు నదిలోకి దిగకుండా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

క్లుప్తంగా

ముస్లిం దంపతుల మత సామరస్యం



భవాని మాలదారులకు భోజనం వడ్డిస్తున్న ముస్లిం దంపతులు

అశ్వారావుపేటరూరల్: ముస్లిం దంపతులు భవానీ మాలధారులకు భిక్ష(అన్నదానం) చేసి మత సామరస్యం చాటారు. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన ఎస్‌కే కరీం –గౌసియా దంపతులు గురువారం తమ గ్రామంలో భవాని మాలధరించిన స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ముస్లిం దంపతులు మాట్లాడుతూ కుల మతాలు వేరైనా మనుషులంతా ఒకటేనని, ఎంతో కఠోర దీక్ష చేసే భవాని మాలదారులకు అన్నదానం చేసే అదృష్టం తమ దక్కడం సంతోకరమని అన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక



పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం

సింగరేణి(కొత్తగూడెం): సెప్టెంబర్ 16,17 తేదీల్లో కొత్తగూడెంలోని ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్‌లో పీడీఎస్‌యూ జిల్లా మహాసభలు జరిగాయి. మొదటి రోజు పట్టణంలో విద్యార్థుల ప్రదర్శన, రెండో రోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోగా, గురువారం వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా వి.విజయ్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జే.గణేష్‌లతోపాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సింగరేణి మహిళా కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగం హెచ్‌ఓడీగా పనిచేస్తున్న జి.మంజులకు ఏపీలోని నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంగ్లంలో పరిశోధన చేసినందుకు



మంజుల

ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా సింగరేణి జీఎం ఎడ్యుకేషన్ ఎస్.వెంకటాచారి, కరస్పాండెంట్ జీకే కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, కళాశాల లెక్చరర్లు అభినందనలు తెలిపారు.

నర్సరీలోని మొక్కలు ధ్వంసం!

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దబండిరేవు గ్రామంలోని అటవీశాఖ నర్సరీలోని దాదాపు 2 లక్షల మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్టు సమాచారం. నర్సరీలోని మొక్కలపై దుండగులు పురుగు మందు స్ప్రే చేయడంతో మొక్కలు మాడిపోయినట్లు తెలిసింది. రేంజర్ కమల సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు.

22న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ బాలుర జట్టును ఈనెల 22న ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో పాటు ఇంటర్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్ కళాశాలల పోటీల్లో పాల్గొంటుందని, వివరాలకు 99896 47696, 98483 41238 నంబర్లలో సూచించారు.

పద్ధతి మార్చుకోకుంటే శిక్ష తప్పదు

చర్ల: కాంట్రాక్టర్లు, వ్యాపారులు, భూస్వాములు, రాజకీయ నాయకులతో పాటు ఓ విలేకరి పద్ధతి మార్చుకోకుంటే ప్రజాకోర్టులో శిక్ష తప్పదని మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి విప్లవ పేరిట గురువారం రాత్రి లేఖ విడుదలైంది. విప్లవోద్యమంపై పాలకుల, భూస్వా మ్య, పెత్తందారుల విధానాలు మళ్లీ పెచ్చరిల్లుతున్నాయని, పేద, మధ్య తరగతి వర్గాలపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కొందరు పెత్తందారులు ఈ పోకడలకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రాజకీయ బ్రోకర్లతో కలిసి పెత్తందారులు, భూస్వాములు ఈ పైశాచిక చర్యలకు పాల్పడుతున్నట్లు తమదృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. భూస్వాములు వారి భూములను పేదలకు పంచాలని, లేదంటే తామే స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని ప్రకటించారు. కొందరు రాజకీయ నాయకులు, వ్యాపారులు, భూస్వాములు, కాంట్రాక్టర్లు పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని, ఓ విలేకరి(సాక్షి కాదు) కూడా ఇలాంటి వైఖరే ప్రదర్శిస్తున్నాడని, వారు పద్ధతి మార్చుకోకుంటే ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

యంత్రాలు వినియోగించుకుంటే..



ధాన్యం తూర్పార బట్టే యంత్రాలు



ధాన్యం నాణ్యత కోసం ఉపయోగించే డ్రయ్యర్ యంత్రం

పంట ఉత్పత్తుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు

- రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందే అవకాశం
- అవగాహన కల్పించని అధికారులు
- కార్యాలయాల్లోనే మూలుగుతున్న వ్యవసాయ యంత్రాలు

ఇల్లెందు: మద్దతు ధర పొందాలంటే నిబంధనల ప్రకారం పంట ఉత్పత్తుల్లో వ్యర్థాలు ఉండకూడదు. తేమ నిర్దేశిత శాతానికి మించొద్దు. అప్పుడే రైతులు తాము పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందారు. పంటల్లో వ్యర్థాల తొలగింపునకు, ఉత్పత్తులను ఆరబెట్టేందుకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. కానీ అవగాహన లేకపోవడంతో రైతులు ఉపయోగించుకోవడంలేదు. దీంతో రూ. కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు కార్యాలయాల్లో, గోదాంలలో మూలుగుతున్నాయి.

5.92 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 5,92,264 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. 1,39,169 మంది రైతులు ఉన్నారు. వరి 42 వేల ఎకరాలు, పత్తి 2.11 లక్షలు ఎకరాలు, మొక్కజొన్న 84 వేల ఎకరాలు, పెసర 346 ఎకరాలు, కంది 1,071 ఎకరాలతోపాటు మరికొన్ని పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పంటల కొనుగోలు సమయంలో వ్యాపారులు, అధికారులు ఆయా పంటలను పరిశీలించి యంత్రాలతో నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయిస్తుంటారు. అందుకు తగ్గట్లు పరిశుభ్రత పాటించకపోతే మద్దతు ధర లభించదు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ఆయా మార్కెట్ యార్డుల్లో ధాన్యం నాణ్యత నిర్ధారణ యంత్రాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఎక్కువ మంది రైతులు వీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. తద్వారా ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర పొందలేకపోతున్నారు. ఇందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంలేదు.

అందుబాటులో ఉన్న యంత్రాలు

ధాన్యానికి సంబంధించి నూర్పిడి యంత్రం, తాలు లేకుండా చేసేందుకు జల్లెడ, ప్యాడీ క్లీనర్, తూర్పార యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉంటే డ్రయ్యర్ అనే యంత్రంతో ఆరబెట్టవచ్చు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో ప్యాడీ క్లీనర్ యంత్రాలు 60, ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్స్ రెండు, పెద్ద ప్యాడీ క్లీనర్ యంత్రాలు 13, ఒక డ్రయ్యర్ ఉన్నాయి. టార్పాలిన్‌లు 1900, ఎలక్ట్రానిక్ తూకం కాంటాలు 157, తేమ శాతం తేల్చే మిషన్లు 83, క్యాలీబర్స్ 54, టస్క్ రిమూవర్స్ 57 వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాలను రైతులకు ఉచితంగా అందజేస్తారు. కాగా జిల్లాలో 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా ఐకేపీ, పీఏసీఎస్, జీసీసీలు వీటిని నిర్వహిస్తాయి.

ఉచితంగా వాడుకోవచ్చు



మార్కెట్ యార్డుల్లో పంటల పరిశుభ్రతకు ఉపయోగించుకోవాల్సిన యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పంట ఉత్పత్తుల్లో నాణ్యత పెంచుకుంటే మద్దతు ధర పొందవచ్చు. యంత్రాలను రైతులకు ఉచితంగానే అందజేస్తాం.

–ఈ.నరేష్, మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెంటౌన్: ఆరుగురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. గురువారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులతో కలిసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడుకు చెందిన మడకం దేవా (ఏసీఎం ఏరియా కమిటీ సౌత్ బస్తర్), పార్టీ మెంబర్ మడవి జోగా, మిలీషియా సభ్యులు, పోడియం దేవా, మడకం ఇడుమ, మడకం ముకా, మడవి ఐతా లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులకు ఒక్కొక్కరికి తక్షణసాయం కింద రూ.25 వేల చొప్పున నగదు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తామని ఎస్పీ రోహిత్ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, సీఆర్పీఎఫ్ అధికారులు

‘రేడియో’లో రామానుజవరం విద్యార్థినులు



రేడియో కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

మణుగూరు రూరల్ : మండలంలోని రామానుజవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం కొత్తగూడెం ఆకాశవాణి రేడియో కదంబ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపారు. సుమారు గంట సేపు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పి.నిఖిత, జి.అక్షయ దివ్య, ఎస్‌కే. అస్రత్, ఎ.శ్రావణి, పి.పుష్పాంజలి, బి.మహిమతేజలు గురువులకు వందనాల పాట పాడారు. సెల్‌ఫోన్లతో కలిగే నష్టాలను తెలిపే కవితలను చదివారు. పొడుపుకథలు, కనువిప్పు నాటిక, జోకులు, ఐకమత్యమే మహాబలం ఆంగ్ల కథ, తెలుగునీతి పద్యాలు, నాకు నచ్చిన నాయకుడు అబ్దుల్ కలాం తదితర అంశాలను వివరించారు. విద్యార్థినులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు వీవీ కోటేశ్వరరావు, జి.సురేష్‌లను పాఠశాల హెచ్‌ఎం యశోద అభినందించారు. కాగా రేడియో కార్యక్రమం ఈ నెల 21న మధ్యాహ్నం 12.40 గంటలకు కొత్తగూడెం ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుందని హెచ్‌ఎం తెలిపారు.

రూ.25లక్షల పోస్టల్ బీమా చెక్కు

వేంసూరు: మండలంలోని అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి పోస్టల్ బీమా ద్వారా మంజూరైన రూ.25లక్షల చెక్కును ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి గురువారం అందజేశారు. గత ఏడాది పాండురంగాచారి రూ.549, రూ.749 ప్రీమియంతో రెండు బీమా పాలసీలు చేశారని ఆయన తెలిపారు. తక్కువ ప్రీమియంతో బీమా పథకాలు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

కారు, బైక్ ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పినపాక: ద్విచక్ర వాహనం, కారు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డ ఘటన మండలంలోని ఐలాపురం వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మణుగూరు మండలం సమితిసింగారం గ్రామానికి చెందిన పాల్వంచ మహేష్ (32) మేనకోడలు అంజలితో కలిసి ద్విచక్రవాహనంపై గడ్డంపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తన కూతురు వద్దకు వెళ్లాడు. కూతురిని చూసి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై జానంపేట నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు అప్పటికే మహేష్ మృతి చెందాడని తెలిపారు. అంజలి చికిత్స పొందుతోంది. కాగా కారు బైక్ ఢీకొన్నాక రోడ్డు దిగి చెట్లలోకి దూసుకెళ్లింది. కారు డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు.



పాల్వంచ మహేష్ (ఫైల్)

కొత్తగా పోడు నరికాడని..

గిరిజన రైతుపై కేసు నమోదు చేసిన అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి 124 చెట్లు నరకడాన్ని గుర్తించిన అటవీ అధికారులు కేసు నమోదు చేసి, రూ 23 వేలు జరిమానా విధించారు. మండలంలోని రాజారావుపేట బీట్‌ను గురువారం అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్లు లోకనాథం, రాఘవరావు పరిశీలించారు. కంపార్ట్‌మెంట్ 35లో పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన సునావత్ రమేష్ అనే వ్యక్తి కొత్తగా పోడు నరికినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. కాగా రమేష్‌కు 2006లో 5.5 ఎకరాల పోడు భూమికి ప్రభుత్వం అటవీ హక్కు పత్రాన్ని అందించింది. ఐదున్నర ఎకరాల పోడు భూమిలో సాగు చేయకుండా కొంత భూమి వదిలేశానని, ఆ స్థలంలోని చెట్లు నరికానని బాధిత రైతు రమేష్ చెబుతున్నాడు. హక్కు పత్రా లున్న భూమి పక్కన అటవీ ప్రాంతాన్ని ఆక్రమించి చెట్లు నరికి కొత్తగా పోడు సాగు చేసేందుకు రమేష్ ప్రయత్నిస్తున్నాడని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో రాజారావుపేట సెక్షన్ ఆఫీసర్ హారిక, బీట్ ఆఫీసర్లు ఎస్కే రహీం, రేఖ పాల్గొన్నారు.



చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట



మొక్క నాటుతున్న సబ్ కలెక్టర్, తదితరులు

భద్రాచలంటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల పక్కన కరకట్టపై గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మొక్క నాటి మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి సంస్థ మరిన్ని పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయాన్ని సందదర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు చిట్టె లలిత, పామరాజు తిరుమలరావు, పల్లింటి దేశప్ప, కామిశెట్టి కృష్ణార్జునరావు, గంగాధర వీరయ్య, బిర్రు సుధాకర్, రామరాజు, ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, అబ్బినేని శ్రీనివాసరావు, గొర్ల వెంకటేశ్వరరావు, ఆర్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యావసతుల విస్తరణకు కృషి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యా వసతుల విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని రామవరం ఏరియా బాలికల గురుకుల పాఠశాలలో రూ.5 కోట్ల ఐటీడీఏ నిధులతో చేపట్టనున్న వసతిగృహాల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ మంది గిరిజన, గిరిజనేతర పేద విద్యార్థులు గ్రామీణ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారని, వీరిని మరింత ప్రోత్సహించి ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీఓ అరుణకుమారి, ప్రిన్సిపాల్ శిరీష, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

దుకాణదారుల మధ్య వాగ్వాదం

దుమ్ముగూడెం : పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్ద దుకాణదారుల మధ్య గురువారం వాగ్వాదం జరిగింది. కొద్ది రోజుల క్రితం వినాయక నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతి ఊరేగింపునకు అడ్డుగా ఉన్న కొన్ని దుకాణాలను గ్రామస్తులు తొలగించారు. మరి కొన్ని రోజుల్లో దసరా నవరాత్రులు జరగనున్నాయి. అప్పుడు కూడా దుకాణాలు తొలగించాల్సి రావొచ్చని గ్రామస్తులు దుకాణదారులతో చర్చిస్తున్నారు. ఈ క్రమంలో గుడి ముందర ఉన్న దుకాణాలను తొలగించాలని కొందరు పేర్కొనడంతో వాగ్వాదం నెలకొంది.

‘సీతారామ’ మట్టి మాయం!

- టిప్పర్ లారీలతో అర్ధరాత్రి తరలింపు
- వందలాది ట్రిప్పుల కాలువ మట్టి స్వాహా



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్ లారీ (ఫైల్)



సీతారామ ప్రాజెక్ట్ కాలువ వద్ద నుంచి మట్టి తరలించిన దృశ్యం

ములకలపల్లి : మండల పరిధిలోని సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ) ప్రధాన కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. జేసీబీలతో టిప్పర్ లారీల్లో నింపి ఇతర ప్రాంతాలకు తోలి విక్రయిస్తున్నారు. పూసుగూడెం, మాధారం మధ్య అటవీ ప్రాంతంలోని మెయిన్ కెనాల్ సమీపం నుంచి యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. జనసంచారం లేని ప్రాంతం కావడంతో అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా మట్టి తరలించుకుపోతున్నారు. గత కొన్ని నెలులగా ఈ దందా సాగుతుండగా, ఇప్పటికే వందల కొద్దీ టిప్పుల మట్టి పాల్వంచతోపాటు పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో 12 అడుగులకు పైగా ఎత్తుగా పోసిన కాలువ మట్టి తరలిపోతోంది. సుమారు ఐదు వందల టిప్పర్ లారీలకు పైగా మట్టి బయటకు తరలించినట్లు సమాచారం. ఒక్కో టిప్పర్ రూ.5 వేలకు విక్రయించినా రూ.25 లక్షల విలువైన మట్టి తరలించినట్లు తెలుస్తోంది. స్థానిక అధికారుల సహకారంతోనే ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టిప్పర్ సీజ్, జరిమానా విధింపు

కొన్ని నెలలుగా దందా సాగుతున్న క్రమంలో పోలీసులు ఇటీవల ఓ లారీని సీజ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ ప్రాంతంలో రాత్రి వేళ సాగుతున్న మట్టి తోలకాల విషయం బయటకు పొక్కింది. సదరు మట్టి టిప్పర్ లారీని పోలీసులు, రెవెన్యూ శాఖకు అప్పగించారు. రూ.5 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ భూక్యా గనియా తెలిపారు.

ఫిర్యాదు చేశాం

మట్టి తోలకాల విషయంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అక్రమ తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. మట్టి అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం.

–రాంబాబు, డీఈ, నీటి పారుదల శాఖ

కెమికల్ లారీ బోల్తా



బొమ్మనపల్లిలో బోల్తా పడిన లారీ

టేకులపల్లి: అదుపు తప్పి కెమికల్ లారీ బోల్తా పడింది. త్రుటిలో డ్రైవర్, క్లీనర్‌లు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... కర్నూల్ నుంచి భద్రాచలం వెళ్తున్న కెమికల్ లారీ బొమ్మనపల్లి వద్ద గురువారం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ , క్లీనర్ లారీ నుంచి పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. లారీలో కెమికల్స్ ఉన్నా లీకేజీ కాకపోవడంతో ప్రమాదం జరగలేదు.

చెట్టును ఢీకొట్టిన బైక్

- సింగరేణి కార్మికుడి మృతి

మణుగూరు టౌన్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా చెట్టుకు బైక్ ఢీకొని సింగరేణి కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం ముత్యాలమ్మనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఓసీ–2లో డ్రిల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కుమార్ (37) ఉదయం విధులకు హాజరయ్యాడు. విధులు ముగించుకుని ముత్యాలమ్మనగర్ మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో హెల్మెట్ పగిలిపోయి తలకు తీవ్రగాయాలుకాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఇతర అధికారులు ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్, నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు



కుమార్(ఫైల్)

ఆలయంలో చోరీ

- రూ.1.50 లక్షల విలువైన అమ్మవారి ఆభరణాలు మాయం

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. తాళం పగులగొట్టి గుర్తుతెలియని ఆలయంలోకి చొరబడ్డారు. గర్భగుడి తలుపు తాళం పగులగొట్టి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. హుండీ కూడా పగులగొట్టారు. రెండు రోజుల క్రితమే ఆలయ కమిటీ కానుకలు లెక్కించడంతో అందులో డబ్బులు లేవు. దొంగలు అపహరించిన ఆభరణాల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బాదావత్ రవి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కాగా మంగళవారం రాత్రి మాచినేనిపేటతండా గ్రామంలో ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. రెండో రోజు బుధవారం రాత్రి కొమ్ముగూడెం శ్రీ పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సింగరేణిలో ఈపీ ఆపరేటర్లకు ఉద్యోగోన్నతి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు ఎక్స్‌కావేషన్ కేటగిరీ డీ నుంచి కేటగిరీ సీకి, కేటగిరీ సీ నుంచి కేటగిరీ బీకి త్వరలో ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. సంస్థలో 150 మంది ప్రమోషన్ పొందనున్నారు. కేటగిరీ డీలో రెండేళ్లు, కేటగిరీ సీలో మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నవారికి ఉద్యోగోన్నతులు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇవ్వనుంది. ఈ మేరకు సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గతంలో ఖాళీలు, ప్రాక్టికల్ పరీక్ష, అసెస్‌మెంట్ నివేదికలో అర్హత ఆధారంగా ఇవే ప్రమోషన్లను ఇచ్చేవారు. ప్రస్తుతం అధ్యయన కమిటీ నివేదిక ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

చిన్నారుల గాంధీగిరి!

తల్లాడ: పాఠశాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు గాంధీ మార్గాన్ని అనుసరించారు. తల్లాడ మండలం మల్లవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యదర్శి షేక్ సిద్దిక్ మియాకు గులాబీపూలు అందించారు. పాఠశాలలో భగీరథ పైపులైన్ లేక తాగునీరు అందడం లేదని, పైపులైన్ నిర్మాణానికి తవ్వి వదిలేయడంతో రోడ్డు పాడైందని పేర్కొన్న వారు పాఠశాలకు ఇరువైపలా పిచ్చిమొక్కలు తీయించాలని కోరారు. కాగా సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని కార్యదర్శి తెలిపారు.



గ్రామకార్యదర్శికి గులాబీపూలు, వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

వృద్ధుడి ఆత్మహత్య

టేకులపల్లి: పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్ఐ అలకుంట రాజేందర్ కథనం ప్రకారం .. మండలంలోని 9వ మైలు తండాకు చెందిన మాలోత్ బీక్యా(75) భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదన చెందుతున్నాడు. వృద్ధాప్యం వల్ల అనారోగ్యం సమస్యలు కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రపోతుండగా పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా అతడి కుమారుడు గమనించి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



మాలోత్ బీక్యా (ఫైల్)